క్లుప్తంగా

గిరిప్రదక్షిణ రోడ్డు పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, డిప్యూటీ మేయర్ సతీష్, కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు

సీతమ్మధార/తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 14వ వార్డు రాధాకృష్ణా లేఅవుట్, గణేష్‌నగర్, 45, 46 వార్డుల పరిధి కైలాసపురం ప్రాంతాల్లో జరుగుతున్న గిరిప్రదక్షిణ రోడ్డు పునర్నిర్మాణ పనులను ఆదివారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. రూ.4,48,46,000 వ్యయంతో గిరిప్రదక్షిణ బీటీ రోడ్డు పునర్నిర్మాణ పనులు జరుగుతున్నట్లు కె.కె.రాజు తెలిపారు. వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డీఈ భరణి, కిరణ్ రాజు, గురువోజీ, నరేష్, సురేష్ పాల్గొన్నారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా



రైతులకు టోకెన్లు ఇస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు ఆదివారం ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు డ్రా తీశారు. రైతులకు స్టాళ్ల నంబర్ టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కేటాయించిన స్టాళ్లలో వారే వ్యాపారం చేయాలన్నారు. కార్యక్రమంలో బజార్ సహాయకుడు సతీష్, వ్యాపారులు పాల్గొన్నారు.

ఒడిశాలో ఉన్న వ్యక్తి కోసం గాలింపు

సీతమ్మధార: మహారాష్ట్ర నుంచి పిస్టోల్‌ను తీసుకొచ్చిన కేసులో ఒడిశాకు సంబంధించిన వ్యక్తి కోసం ఫోర్త్‌టౌన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మహారాష్ట్ర జాల్నా జిల్లాకు చెందిన దత్త పవర్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించారు. శ్రీధర్ హరికిషన్ పతింగికి పిస్టోల్ ఇచ్చి ఒడిశాలోని పూరిలో ఒక వ్యక్తికి దానిని ఇవ్వాలని చెప్పడంతో రూ.30 వేలకు బేరం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఒడిశాలోని బరంపురానికి 15 కిలో మీటర్ల దూరంలో ఆ వ్యక్తి ఉన్నట్లు గుర్తించిన పోలీసులు శనివారం రాత్రి ఒక ఎస్‌ఐతోపాటు మరో కానిస్టేబుల్ అక్కడికి వెళ్లారు. సోమవారం అతడిని నగరానికి తీసుకొచ్చే అవకాశముంది.

మ్యాన్‌హోల్ లీకేజీతో ఇబ్బందులు



ఫోర్త్‌టౌన్ పీఎస్ ఆవరణలో మ్యాన్‌హోల్ నుంచి లీకవుతున్న మురుగు నీరు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలోని మ్యాన్‌హోల్ పొంగడంతో మురుగు నీరు బయటకు ప్రవహిస్తోంది. స్టేషన్ పరిసరాలు దుర్వాసనభరితంగా మారాయి. సిబ్బంది ముక్కు మూసుకుని విధులు నిర్వహించాల్సి వస్తోంది. నెల రోజులుగా ఇదే పరిస్థితి నెలకొనడంతో స్టేషన్‌కు వచ్చే ప్రజలు, ఫిర్యాదుదారులు మురుగు నీటి ప్రవాహం, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గైస్.. న్యూ లుక్

- ఆదర్శ క్యాంపస్‌గా కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల
- సిద్ధమవుతున్న నూతన భవన సముదాయం
- ఆఖరి దశకు చేరిన పనులు



కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో సిద్ధమవుతున్న నూతన భవన సముదాయం



కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మురళీనగర్: రాష్ట్రంలోనే డిప్లొమా స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మక కళాశాలగా గుర్తింపు పొందిన కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) నవీకరణ పనులు ఆఖరి దశకు చేరుకున్నాయి. ఇక్కడ నూతన భవన సముదాయ నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. ఇది అందుబాటులోకి వస్తే గైస్ అందమైన ఆదర్శ క్యాంపస్‌గా తయారవుతుంది. ఈ నేపథ్యంలో నూతన సౌకర్యాలను వీలైనంత త్వరలో ప్రారంభించాలనే ధ్యేయంతో అధికారులు చర్యలు తీసుకున్నారు.

రెండు బ్లాకులు

గైస్‌లో నూతన భవన సముదాయాన్ని రెండు బ్లాకుల్లో నిర్మిస్తున్నారు. ఇందుకోసం రూ.10 కోట్లు నిధులు మంజూరు చేశారు. జీ+1గా భవన సముదాయం నిర్మించారు. రెండు బ్లాక్‌ల్లో కలిపి మొత్తం 20 గదులు ఉంటాయి. బ్లాక్–ఏను ప్రయోగశాలల సముదాయంగా రూపొందించారు. ఇందులో కెమికల్ ఇంజినీరింగ్‌కు సంబంధించిన అన్ని రకాల ల్యాబ్‌లు ఉంటాయి. ప్రస్తుతం ఉన్న ప్రయోగశాలలన్నింటినీ ఇక్కడికి తరలిస్తారు. బ్లాక్–బీలో పరిపాలన కార్యాలయ సముదాయంగా రూపొందించారు. ఇందులో ప్రిన్సిపాల్ చాంబర్, దీనికి అనుబంధంగా కాన్ఫరెన్స్ హాల్, సెమినార్ హాల్, నాలుగు బ్రాంచ్‌లకు సంబంధించిన డిపార్ట్‌మెంట్ హెడ్‌ల చాంబర్లు, నిర్వహణ కార్యాలయం, కంప్యూటర్ ల్యాబ్, ఇంగ్లిష్ ల్యాబ్, బాలికల విశ్రాంతి గది ఉంటాయి.

చురుగ్గా పనులు

ప్రస్తుతం 95 శాతం పనులు పూర్తయ్యాయి. బ్లాకుల్లో పెయింటింగ్, డోర్స్, ఇతర పనులు జరుగుతున్నాయి. ఎలక్ట్రికల్ వర్క్ పూర్తయ్యింది. పాత భవనాన్ని తరగతుల నిర్వహణకు మాత్రమే వినియోగిస్తారు. దీంతో ఇక్కడ మూడు భవనాల సముదాయం ఉంటుంది. వీటికి పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం 65 కేవీఏ సామర్థ్యం గల నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించారు. భూగర్భ కేబుల్ వైరింగ్ పనులు పూర్తయ్యాయి. నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. కళాశాల ప్రాంగణంలోని బాలికల హాస్టల్‌ను దీనికి అనుసంధానించారు. ఈ వసతి గృహంలో 55 మంది బాలికలు ఉంటున్నారు. వార్డెన్, డిప్యూటీ వార్డెన్ ఉన్నారు. డైనింగ్ హాల్, సేఫ్టీ ఫెన్సింగ్ ఉంది.



కాలేజీ ప్రాంగణంలో లవ్ గైస్ లోగో

ఆకట్టుకుంటున్న 'లవ్ గైస్'

కాలేజీ ప్రాంగణంలో నిర్మించిన లవ్ గైస్ లోగో సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. దీన్ని రూ.1.50 లక్షలతో ఏర్పాటు చేశారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి దీన్ని ఇటీవల ప్రారంభించారు. కళాశాలలో పచ్చదనం పరిరక్షణలో భాగంగా గార్డెనింగ్ పనులు జరుగుతున్నాయి. ప్రాంగణంలో పార్కింగ్, పేవ్‌మెంట్ ప్రాంతాలన్నీ టైల్స్‌తో అందంగా తీర్చిదిద్దారు.

ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



అందుబాటులో ఉన్న వనరులతో కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీని ఆదర్శంగా తీర్చిదిద్దాలనే ధ్యేయంతో పని చేస్తున్నాం. నూతన భవన సముదాయం అందుబాటులోకి వస్తే ప్రాంగణం మొత్తం బ్యూటిఫికేషన్ చేయిస్తాం. కెమ్‌దోసా అలూమ్నీ సభ్యుల సంపూర్ణ సహకారంతో కళాశాలను నంబర్ వన్‌గా తయారు చేయాలని సంకల్పించాం. కమిషనర్ చదలవాడ నాగరాణి ఆదేశాల మేరకు అకడమిక్ క్యాలెండర్ పకడ్బందీగా అమలు చేస్తున్నాం.

– డాక్టర్ కె.వెంకటరమణ, ప్రిన్సిపాల్, కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల

అందరి సహకారంతో..



కాలేజీ అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం తీసుకుంటున్నాం. ప్రభుత్వం ఇచ్చిన నిధులను సద్వినియోగం చేస్తూనే.. దాతలు, కెమ్‌దోసా సభ్యుల సహకారంతో అనేక సౌకర్యాలు కల్పించాం. విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో నూరు శాతం ప్లేస్‌మెంట్స్ ద్వారా రాష్ట్రంలోనే మంచి గుర్తింపు సాధించాం. ప్రిన్సిపాల్ వెంకటరమణ నేతృత్వంలో అన్ని డిపార్ట్‌మెంట్‌ల హెడ్‌లు, అధ్యాపకులు, సిబ్బంది సమన్వయకంగా పనిచేయడం వల్లే ఇది సాధ్యపడింది.

– డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, విభాగాధిపతి, కెమికల్ ఇంజినీరింగ్

నాణ్యమైన పాలన అందించడమే లక్ష్యం



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: ప్రజలకు నాణ్యమైన పాలన అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 46వ వార్డు లక్ష్మీనారాయణ పురం, శాంతినగర్, కస్తూరినగర్ ప్రాంతాల్లో ఆదివారం జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్‌తో కలిసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించి కరపత్రాలు అందించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుంటూ ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ మేలు చేకూరేలా సంక్షేమ పథకాలను నిజాయితీగా అందించడమే కాకుండా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, బల్లిరెడ్డి గోవింద్, కె.చిన్నా, దూది నరసింగరావు, సీతయ్యరెడ్డి, కె.రామారావు, కె.లావణ్య, దుర్గాభవాని, ఎస్.ఈశ్వరరావు, జి.అప్పారావు, వి.శ్రీను, ఎస్.రామారావు, కె.శ్రీను, అప్పలరెడ్డి, విజయలక్ష్మీదేవి, తారకేష్, సీనియర్ నాయకులు షేక్ బాబ్జీ, కృపా, రాఘవులు, నాగరాజు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, జీవీఎంసీ అధికారులు, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

7 నుంచి బాక్సింగ్ పోటీలు



బాక్సింగ్ పోటీల ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సీతమ్మధార: వైఎస్సార్ కప్ 10వ జిల్లా స్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ బాక్సింగ్ పోటీల ట్రోఫీని సీతమ్మధారలోని తన నివాసంలో ఆదివారం మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతి బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో జూలై 7, 8, 9 తేదీల్లో మధురవాడ చంద్రపాలెం జెడ్పీ హైస్కూల్ ఆవరణలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి అప్పలరెడ్డి, దల్లి రామకృష్ణారెడ్డి, కోచ్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయత్నంతో ఏదైనా సాధ్యం



విద్యార్థులకు సూచనలిస్తున్న రేవళ్ల మోహన్

సీతంపేట: ప్రయత్నంతో ఏదైనా సాధించవచ్చని ఆక్స్‌మో బ్రిడ్జి వ్యవస్థాపకుడు రేవళ్ల మోహన్ అన్నారు. రంగసాయి నాటక గ్రంథాలయం ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, ఇంగ్లిష్ మాట్లాడటంపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధనతో జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవచ్చని, చిన్నపాటి మెళకువలతో ఏకాగ్రత సుసాధ్యం అవుతుందన్నారు. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత మెరుగుపడటం కోసం పలు సూచనలు, సలహాలిచ్చారు. సోషల్ వర్కర్ అబ్దుల్ కరీం మాట్లాడుతూ యాంత్రిక సమాజంలో జ్ఞాపకశక్తి ఆవశ్యకతను వివరించారు. లెక్సికోగ్రాఫర్, వీఎస్‌డీ ఆంగ్ల ఆంధ్ర నిఘంటువు కర్త సనపల జీవన్‌కుమార్ మాట్లాడుతూ భాషలో పట్టు వినియోగంలో అనుసరించాల్సిన విషయాలను వివరించారు. కార్యక్రమంలో మాచెర్ల ఆనంద్‌శర్మ, బి.ఎస్.చంద్రశేఖర్, బాదంగీర్ సాయి, డి.హేమ, వియ్యపు రామకృష్ణ, కిరణ్, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది ఆత్మీయ కలయిక

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లోని పలువురు కానిస్టేబుళ్ల బదిలీల నేపథ్యంలో ఆదివారం గురుద్వారా దరి ఓ హోటల్‌లో ఆత్మీయ కలయిక జరిగింది. బదిలీపై వచ్చిన వారు, వెళ్లిన వారు కలుసుకుని అభినందనలు తెలియజేసుకున్నారు.

క్రీస్తును ఆరాధిస్తూ ప్రత్యేక ప్రార్థనలు



వాక్య సందేశమిస్తున్న పాస్టర్ కామినాయుడు

సీతంపేట: గాడ్ మెస్సీయా సంఘం వ్యవస్థాపకుడు, పాస్టర్ జి.కామినాయుడు ఆధ్వర్యంలో ఆదివారం అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్‌లోని సంఘ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక వాక్యం, దైవ సందేశమిచ్చారు. స్థానిక క్రీస్తు ఆరాధకులు, సంఘ సభ్యులు పాల్గొని గీతాలు ఆలపించి, ప్రార్థనలు చేశారు.

కావ్యజ్ఞుడు ఆచార్య బేతవోలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య దయానంద, ఆచార్య బేతవోలు, అతిథులు

సీతంపేట: ఆచార్య బేతవోలు రామబ్రహ్మం కావ్యజ్ఞుడని, ప్రసిద్ధ విమర్శకుడిని వక్తలు కొనియాడారు. రచయిత ఆచార్య బేతవోలు రామబ్రహ్మం రచించిన 'కొత్త గోదావరి' పద్య కవితా సంపుటి పరిచయ సభ ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రచయిత పేరి రవికుమార్ పుస్తక సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృజన సాహిత్యం అంతా ఒకచోట ప్రతిబింబించేలా బేతవోలు రచించిన కొత్త గోదావరి కథా సంపుటి ఉంటుందన్నారు. ఆయన రచనల్లో విశ్వనాథ వారి ప్రచోదీప్తి, శ్రీశ్రీ సామాజిక స్పృహ, కరుణశ్రీ రసస్ఫూర్తి కన్పిస్తుందని పేర్కొన్నారు. కొత్త గోదావరి కవితా సంపుటిలో పది కథలు ఉన్నాయని తెలిపారు. శివపార్వతుల మధ్య సంభాషణ శృంగార శ్రీకంఠంలో అద్భుతంగా రచించారన్నారు. బేవతోలు రచనల్లో గంభీరం ఎలా ఉంటుందో అంతే స్థాయిలో చమత్కారం ఉంటుందన్నారు. ముందుగా గీతం వైస్ చాన్సలర్ ఆచార్య దయానంద సిద్ధపటం ముఖ్య అతిథిగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ ప్రయాగ సుబ్రహ్మణ్యం అతిథులను సభకు పరిచయం చేశారు. అనంతరం గ్రంథ రచయిత బేతవోలు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌కు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ సమీపంలోని రోలింగ్ షెడ్ దగ్గర శనివారం రాత్రి గుర్తు తెలియని ఓ వ్యక్తి మరణించాడు. శనివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో రైలు నుంచి లేదా రైలు ఎక్కుతున్న సమయంలో జారిపడి మరణించి ఉంటాడని జీఆర్పీ ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. మరణించిన వ్యక్తి వయసు సుమారు 45–50 ఏళ్లు ఉంటుంది. అతని వద్ద ఏ విధమైన ఆధారాలు లభించలేదు. తెలుపు రంగు చొక్కా, బ్లూ కలర్ జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. కుడిచేతికి ఎరుపు, ఆకుపచ్చ పొడి కలిగిన ఉంగరాలు ఉన్నాయి. కేజీహెచ్ మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచారు. అతని గురించి తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ వద్ద గానీ 94406 27547/98664 13487 నంబర్లలో గానీ సంప్రదించాలని ఎస్‌ఐ సూచించారు.

జిల్లా ధార్మిక కమిటీ ఎంపిక



కొత్తగా ఎంపికైన కమిటీ సభ్యులు

ఎంవీపీ కాలనీ: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్(హెచ్‌డీపీ) విశాఖ జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా నూతన ధార్మిక కమిటీ ఎంపిక ఎంవీపీ కాలనీలో ఆదివారం జరిగింది. వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా హిందూ ధర్మ ప్రచారానికి విశేష సేవలు అందిస్తున్న పలువురిని కమిటీలో సభ్యులుగా నియమించారు. పి.సత్యకుమార్, రమాదేవి, పీవీవీ కామేశ్వరరావు, బి.రాజారావు, ఎం.శ్రీనివాస్, పట్టాభి సూర్యనారాయణమూర్తి, ఎస్.హరిలక్ష్మి, పి.జగన్మోహనరావు, రాధాకృష్ణ, సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు, వెంకటరమణ, అప్పలనరసింహం, ఎం.వెంకటరమణ ఈ కమిటీలో సభ్యులుగా ఎంపికయ్యారని హెచ్‌డీపీ సూపరింటెండెంట్ చంద్రమౌళీశ్వరశర్మ తెలిపారు.

గిరిప్రదక్షిణకు ట్రాఫిక్ ఆంక్షలు



ట్రాఫిక్ ఆంక్షల గురించి వివరిస్తున్న ఏసీపీ జాన్ మనోహర్

సీతమ్మధార: జూలై 2న సింహాచలం శ్రీలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం గిరిప్రదక్షిణను పురస్కరించుకుని లక్షలాది మంది భక్తులు కాలినడకన తరలిరానున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలపై ఏసీపీ జాన్ మనోహర్ పలు సూచనలిచ్చారు. ఈమేరకు ఆదివారం ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. సింహాచలం నుంచి బయలుదేరి హనుమంతువాక, వెంకోజీపాలెం, ఎన్‌ఏడీల వద్ద జాతీయ రహదారిపై కొంత మంది భక్తులు నడిచే అవకాశం ఉన్నందున 2వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 3వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు విశాఖ సిటీలో ట్రాఫిక్ ఎస్‌ఐలు, సిబ్బంది నిర్వహించాల్సిన విధులను వివరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి వచ్చే భారీ వాహనాలను ఆనందపురం నుంచి పెందుర్తి, సబ్బవరం మీదుగా అనకాపల్లి వైపు మళ్లిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ నుంచి విశాఖ వైపు వచ్చే భారీ వాహనాలు, ప్రైవేట్ వాహనాలను లంకెలపాలెం, సబ్బవరం, పెందుర్తి మీదుగా మళ్లిస్తున్నట్లు చెప్పారు. విశాఖలో ఎక్కాల్సిన ప్రయాణికులు ఆనందపురం, పెందుర్తి, అనకాపల్లి వద్దకు చేరుకునేటట్లు బోర్డింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గిరిప్రదక్షిణ రద్దీ దృష్ట్యా ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో ద్వారకా జోన్ ట్రాఫిక్ సీఐ కె.ఎస్.వి.ఎస్.ప్రసాద్, ఎస్‌ఐ రామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు



రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ఫోర్త్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొడవలు, తగాదాల్లో తలదూర్చితే, మద్యం సేవించి అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి రోజూ ఎక్కడికి వెళ్లిన సమాచారమివ్వాలని చెప్పారు. ఎటువంటి నేరాలు జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీషీటర్లకు సీఐ హితవు పలికారు. అనంతరం వారిని ఇళ్ల వద్ద అప్పగించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో..

స్థానిక ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు సీఐ శ్రీనివాసరావు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి నేరాలు చేయకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మోహన్‌రావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం



వైద్య పరీక్షలు చేస్తున్న స్పెషలిస్ట్ డాక్టర్లు

మురళీనగర్: చెవి, ముక్కు, గొంతు చాలా వ్యాధులకు ముఖద్వారాలు లాంటివని, వీటిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందని ఈఎన్‌టీ స్పెషలిస్ట్ డాక్టర్ దిలీప్ దుంగల అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కు ప్రాంగణంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సెవెన్ హిల్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. చెవిలో గులుమును శుభ్రపరిచేందుకు వివిధ రకాలైన ఇయర్ బడ్స్ వాడడం మంచిది కాదన్నారు. చెవి దురద ఉపశమనానికి ఇయర్ బడ్స్ వాడటం, చెవిలో నూనెలు వేయడం చేయరాదని చెప్పారు. చెవిలో నాడి వచ్చినప్పుడు ఇన్‌ఫెక్షన్ ఉన్నట్టు నిర్ధారించుకుని డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సీహెచ్ వరప్రసాద్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శిబిరంలో 148 మందికి వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ దిలీప్, డాక్టర్ వరప్రసాద్‌లను వాకర్స్ క్లబ్ సభ్యులు సత్కరించి జ్ఞాపికలను అందించారు. సెవెన్ హిల్స్ ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ మిండి లోకేష్ వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్‌వీ సుధాకర్, వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శి కె.ద్వారకానాథ్, పూర్వాధ్యక్షులు నిమ్మగడ్డ బుచ్చయ్య, రాళ్లపల్లి సత్యనాథం జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, కోశాధికారి జె.కూర్మారావు, ఉపాధ్యక్షులు ఆదిభట్ల రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి ఎస్.సీతారామకృష్ణ, పి.చెల్వరాజు, బి.సూర్యనారాయణ, వడ్డాది అప్పారావు, ఎంఎస్ఆర్ మూర్తి, టీవీ రమణ పర్యవేక్షించారు.

వ్యక్తి అదృశ్యం



సూరిశెట్టి కాశీవిశ్వనాథ్

మర్రిపాలెం: గత నెలలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. గవర కంచరపాలెంలో నివసిస్తున్న సూరిశెట్టి కాశీవిశ్వనాథ్ ఆటోనగర్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఇతడికి 2016లో వివాహం జరిగింది. దంపతుల మధ్యలో ఎటువంటి తగాదాలు లేవు. సదరు వ్యక్తి ఫోన్‌లో బెట్టింగులు ఆడేవాడు. గత నెల 15న పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో కాశీవిశ్వనాథ్ తండ్రి సూరిశెట్టి రాము కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో కేసు దర్యాప్తు చేపట్టారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మాధవధార ఈస్ట్ పార్కులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈస్ట్ పార్క్ అధ్యక్షుడు మురళీకృష్ణ పర్యవేక్షణలో టయో లాబ్స్ సహకారంతో 100 మందికి రక్తపోటు, మధుమేహం పరీక్షలు చేశారు. వర్షా కాలంలో వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈట చాందిని వివరించారు. వర్షా కాలంలో గోరువెచ్చని నీరు తాగాలని, రిఫ్రిజిరేటర్‌లో ఉంచిన పదార్థాలు ఎక్కువగా తినకూడదని చెప్పారు. టయో లాబ్స్ రాజశేఖర్, రమేష్, మహిళా క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి, కార్యదర్శి ఎస్.పుష్పలత, కోశాధికారి లక్ష్మి, పూర్వ అధ్యక్షులు కె.మాధవి, శిరీష, సభ్యులు రాజేశ్వరి, లక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ 11 కేవీ గ్రీన్‌పార్క్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్–1 ఈఈ (ఆపరేషన్స్) జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పనులు శనివారం చేపట్టాల్సి ఉన్నప్పటికీ.. వర్షాల కారణంగా రద్దు చేసి తిరిగి సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు నరసింహనగర్ రైతుబజార్ ప్రాంతం, బాలయ్యశాస్త్రి లేఅవుట్, శాంతిపురం, ఎన్‌జీజీవోస్ కాలనీ, శంకరమఠం రోడ్, జీవీఎంసీ పంప్ హౌస్, జీవీఎంసీ స్కూల్స్, విద్యుత్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్, కిన్నెర మెస్ ప్రాంతం, జీవీఎంసీ పార్క్ సచివాలయం, పద్మశ్రీ హాస్పిటల్, ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి గంటల మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.